# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మహాత్మా గాంధీ స్ఫూర్తితోనే స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని రూపొందించామని బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.
- ❖ ఈనెల 24 నుంచి జూన్ 6వ తేదీ వరకు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లుగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్ తెలిపారు.
- ❖ అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని రేపు విశాఖపట్నంలో నిర్వహించనున్నారు.
- ❖ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నైరుతి బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==========================

మహాత్మా గాంధీ బోధనల నుండి తాను స్ఫూర్తి పొందానని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. బీహార్‌లోని మోతీహారిలోని గాంధీ మైదాన్‌లో ఈ రోజు జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించాలనే ఆలోచన బాపూజీ స్ఫూర్తితోనే వచ్చిందని అన్నారు. కాగా, భారత దేశం 21వ శతాబ్దం కలలను నెరవేర్చేది భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని జాతీయ ప్రజా స్వామ్య కూటమి మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కేంద్రంలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలోనే రాబోయే ఐదేళ్లలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతాయని హామీ ఇచ్చారు. పేద ప్రజలకు విద్యుత్, గ్యాస్ కనెక్షన్లు అందించేందుకు తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా ప్రధాని వివరించారు.

==========================

రాష్ట్రంలో ఈనెల 24 నుంచి జూన్ 6వ తేదీ వరకు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లుగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్ తెలిపారు. ఒక లక్షా 61 వేల 877 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారని ఆయన వివరించారు. వీరిలో 96 వేల 938 మంది విద్యార్థులు, 64 వేల 939 మంది విద్యార్థినులు

ఉన్నారని పేర్కొన్నారు.  ఈ  పరీక్షల నిర్వహణకు 685 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గటంటల 45 నిమిషాల వరకు పరీక్షలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గిరిజనుల సాంస్కృతిక  హస్తకళా నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని రేపు విశాఖపట్నంలో   నిర్వహించనున్నారు.   ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఈ కామర్స్ ప్లాట్ ఫామ్ అమెజాన్ సహకారంతో నిర్వహించే   ఈ కార్యక్రమంలో   గిరిజనులు తయారు చేసే ఉత్పత్తులకు ఆర్థిక సాధికారత కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాల్లో జరిగే అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంలో విశాఖ జిల్లా అటవీశాఖ అధికారి అనంత్ శంకర్ అమెజాన్ ఇండియాతో  అవగాహన ఒప్పందాలపైన సంతకం చేయనున్నారు. విశాఖలోని శంభువానిపాలెంలో నివసించే గిరిజన వర్గాల వారసత్వ హస్తకళాకృతులకు అమెజాన్ యొక్క ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్ నుంచి మార్కెట్ సదుపాయం కల్పించానున్నామని అనంత శంకర్ తెలిపారు. అలాగే, విస్తారమైన పరిధిని, వనరులను, గిరిజన హస్తకళలను ప్రదర్శించడం, విక్రయించడం ద్వారా తోడ్పాటునందిస్తామని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నైరుతి బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.  ఇది ఈశాన్య దిశగా కదులుతూ ఈ నెల 24 ఉదయం నాటికి బంగాళాఖాతంలోని మధ్య భాగాలపై అల్పపీడనంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. ఆ వివరాలను అమరావతిలోని వాతావరణ కేంద్రం అధికారి తెలియజేస్తూ.....

(వాయిస్ 45 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల జారీని ఈ రోజు నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రారంభించింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మార్చిలో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను టీటీడీ రద్దు చేసింది.  ఇటీవల ఎన్నికలు ముగియడంతో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల జారీకి అనుమతించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని టీటీడీ అభ్యర్థించింది. ఈ అభ్యర్ధనకు సానుకూలంగా ఈసీ స్పందించింది.  దీంతో ఈ రోజు నుంచి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల సిఫార్సు లేఖలను అధికారులు అనుమతిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రం నుండి ఈ ఏడాది హజ్ యాత్ర చేసే యాత్రికుల కోసం విజయవాడలో గన్నవరం విమానాశ్రయంలో మూడు విమానాలను అందుబాటులో ఉంచినట్లుగా  రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ పేర్కొంది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఈ విమానాలు గన్నవరం నుంచి బయల్దేరి సౌదీ అరేబియాలోని జెడ్డా విమానాశ్రయంకు చేరుకుంటాయని అధికారులు తెలిపారు. హజ్ యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వివిధ శాఖల అధికారులను  సమన్వయం చేసినట్లుగా వివరించారు. ఇదిలా ఉండగా హజ్ యాత్రికుల సౌకర్యార్థం 1800-4257873 టోల్ ఫ్రీ నెంబర్ ను కేటాయించటం జరిగిందని అధికారులు వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నం నుంచి ఈరోజు రాత్రి 8 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం నాందేడ్ ఎక్స్ ప్రెస్ ఈరోజు అర్ధరాత్రి ఒంటి గంటన్నరకు బయలుదేరుతుందని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రయాణికులు ఈ మార్పును గుర్తించాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా పాడేరు సబ్ డివిజన్ జి.మాడుగుల సర్కిల్ లోని పెదబయలు పోలీస్ స్టేషన్ ను ఈ రోజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కౌంటింగ్ వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. పెట్రోల్ బంకులు, దుకాణాల వద్ద బాటిళ్ళలో పెట్రోల్ విక్రయాలు జరగకుండా చూడాలని కోరారు. అదే విధంగా స్థానికంగా గంజాయి రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకోమని ఎస్పీ ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జిల్లాలోని ఇసుక రీచ్ లలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎమ్.వేణుగోపాల రెడ్డి తెలిపారు. ఈ రోజు జిల్లా ఎస్.పి తుషార్ దూడీతో కలిసి తాడేపల్లి, కొల్లిపర మండలాలలోని ఇసుక రీచ్ లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, అక్రమ తవ్వకాలు నివారించేందుకు మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖలతో కలిపి శ్యాండ్ కమిటీలను ఏర్పాటుచేశామని కలెక్టర్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని అనంతపురం జిల్లా గ్రంథాలయం సంస్థ కార్యాదర్శి రమ తెలిపారు. ఈ రోజు అనంతపురం జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో వేసవి విజ్ఞాన శిబిరాలను ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, గణితం నేర్పించడం, యోగ మొదలైనవి ఉచితంగా నేర్పిస్తున్నామని ఆమె తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సత్ప్రవర్తనతోనే ఖైదీలలో మార్పు రావాలని పార్వతీపురం మన్యం జిల్లా న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. ఈరోజు స్థానికంగా ఉన్న సబ్ జైలును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీల ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. మంచి భోజనం, వసతి వంటి వాటి మీద ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్ కోసం ఖైదీలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి విజయ కల్యాణి పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ జిల్లాలో పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 24 నుంచి జరగనున్న పదవ తరగతి సప్లిమెంటరీ, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై ఈ రోజు ఆయన అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జూన్ 3వ తేదీ వరకు పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని అన్నారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 4 వేల 836 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం 20 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం సింహాచలంలోని శ్రీ వరహా లక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయంలో నృసింహ హోమాన్ని నిర్వహిస్తున్నట్లుగా ఆలయ అధికారులు తెలిపారు. స్వామి వారి జన్మ నక్షత్రం అయిన స్వాతీ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ హోమాన్ని స్వామి సన్నిధిలో నిర్వహిస్తున్నట్లుగా అధికారులు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల ఫలితాల తరువాత అభ్యర్ధులు విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లుగా పల్నాడు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మల్లికా గార్గ్ తెలిపారు. జిల్లాలో అల్లర్ల నిందితుల కోసం అన్వేషణ కొనసాగిస్తున్నామని అన్నారు. అలాగే భారీ ఎత్తున బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. కౌంటింగ్ రోజున హిస్టరీ షీట్స్ ఉన్న వారందరినీ పోలీస్ స్టేషన్లకు పిలవాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అలాగే, ఎన్నికల నేరాలకు పాల్పడేవారిని దూరంగా ఉండే పోలీస్ స్టేషన్లకు తరలిస్తామని ఎస్పీ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రజా రవాణా అధికారి సి. హెచ్. అప్పలనారాయణ తెలిపారు. ఈ రోజు విజయనగరం ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న 16వ బ్యాచ్ కు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 17వ బ్యాచ్ లో చేరడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులని ఆహ్వానిస్తున్నట్లుగా తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్ తో పాటు ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 సంవత్సరాలు నిండినవారు ఈ వెహికల్ లైసెన్స్ డ్రైవింగ్ ట్రైనింగ్ కు అర్హులని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =